
# మహానగరం కథలు

-వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా,  తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బుడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ,  స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే  జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు..  ఈ మహానగరం కథలు..!!

# అక్కడే పుట్టి ఇక్కడే కలిసి..

టార్గెట్ షాప్ లో కనిపించిన ఆ అమ్మాయిని చూడగానే ఎక్కడో చూసినట్టూ, ఎప్పటినించో తెలిసినట్టుగా అనిపించడంతో ఆ అమ్మాయి ఏమైనా అనుకుంటుందేమోనన్న సంశయం కూడా లేకుండా డైరెక్ట్ గా వెళ్ళి " "ఎక్స్క్యూజ్ మీ! వన్ మినిట్ " అంటూ ఆ అమ్మాయిని పలకరించింది శృతి .

'ఎవరా?' అన్నట్టుగా, ఆ అమ్మాయి వెనక్కి తిరిగి చూసింది. చక్కని కళ గల ముఖం, బారెడు జడ, కాటుక తీర్చిన పెద్ద కళ్ళూ. చాలా అందం గా ఉంది ఆ అమ్మాయి.

"మీరు! మిమ్మల్నెక్కడో చూసినట్టు అనిపిస్తోంది. ఐ నో! మనం ఎప్పుడూ కలవలేదు. అయినా సరే! " ఆ అమ్మాయితో అంది శృతి.

"అవునా! నేను మిమ్మల్నెప్పుడూ చూడలేదు, కానీ మీ ముఖం మాత్రం పరిచయమున్నవారిలాగే అనిపిస్తోంది. నా పేరు రేఖ, రేఖా శశిధర్. మేము చెన్నై నించి కిందటి నెలే ఇక్కడకి వచ్చాము " అంది ఆ అమ్మాయి కూడా నవ్వుతూ.

" అవునా, అందుకే అంత చక్కగా, ట్రెడిషనల్ గా ఉన్నారు, మాది అమెరికాయే " అంది శృతి.

" అమెరికానా?? అంటే? ఇక్కడే పుట్టారా?" అంది ఆశ్చర్యంగా.

" యా, పుట్టలేదు కానీ ఇంచుమించు పుట్టినట్టే. మా నాన్నా అమ్మా, నేను పుట్టిన రెండు మూడేళ్ళకే ఇక్కడికి వచ్చేశారు. అప్పటినించి ఈ దేశంలో రెండు మూడు చోట్ల తిరిగినా ఇప్పుడు శాన్ డియాగోలో ఉంటారు. అందుకని మాది అమెరికాయే" అంది నవ్వుతూ..

"ఓ అలాగా! మేము కూడా ఇంచుమించు అంతే, నాన్న ఉద్యోగం వల్ల చాలాకాలం క్రితమే చెన్నై వచ్చాము. నాన్నగారు వాళ్ళది హైదరాబాద్, అమ్మది విజయవాడ " అంది రేఖ. "మీరిక్కడ ఎన్నేళ్ళనించీ ఉంటున్నారు? ఏం చేస్తారు? " లాంటి ప్రశ్నలు వేసింది.

అప్పటివరకూ ఇంగ్లీష్ లో సాగుతున్న వారి సంభాషణ శృతి ఫోన్లో ఎవరితోనో తెలుగులో మాట్లాడిన తర్వాత తెలుగులోకి మారిపోయింది.

" మీరు తెలుగువారా?" అంది రేఖ ఆనందంగా..

" అవును– కాదు. మా డేడీ తెలుగు. మా అమ్మ మరాఠీ అమ్మాయి. అందుకని ఇంట్లో రెండూ మాట్లాడతాము. నా భర్త అమర్ మాత్రం తెలుగువారు" అంది శృతి.

మేమిక్కడకి వచ్చి దాదాపు ఐదేళ్ళవుతోంది, నా పెళ్ళి అయ్యాకా. విలేజ్ బై ద సీ అన్న అందమైన పేరున్న పట్టణం ఈ కార్ల్స్ బాద్. శాండియాగో కీ, లాస్ ఏంజలీస్ కి మధ్యలో ఉన్న ఆ ఊరు ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. ఎటు కావాలన్నా హాయిగా డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళిపోవచ్చు, అందుకే నాకూ అమర్ కీ కూడా ఈ ఊరంటే ఎంతో ఇష్టం అంది. మా పాప సమిక ఇక్కడే పుట్టింది కూడా" అంది

" ఏదీ? మీతో రాలేదా? " అడిగింది రేఖ.

" నిద్రపోతోంది, అమర్ చూసుకుంటానంటే తన దగ్గర వదిలేసి వచ్చాను" అంది నవ్వుతూ. " కాఫీ తాగుదామా?" అంది తనే మళ్ళీ. ఇద్దరూ పక్కనే ఉన్న స్టార్ బక్స్ కెఫే లోకి వెళ్ళారు.

" మన మొదటి పరిచయానికి గుర్తుగా ఈ రోజు బిల్ నాది, చెప్పండి! ఏం తీసుకుంటారు? " అని అడిగింది.

" మీరు చాలా సరదాగా మాట్లాడతారు, నాకైతే ఇదే మనం మొదటిసారి కలిసినట్లు అనిపించడమే లేదు. ఈ మధ్యనే రావడం, ఇక్కడి వాతావరణం, మనుష్యులు అన్నీ కొత్తగా ఉన్న ఈ సమయంలో మీరు పరిచయం అవడం నిజంగా హేపీ" అంది రేఖ.

" కొన్ని సార్లు మన ప్రయత్నం లేకుండానే మంచి ఫ్రెండ్స్ కలుస్తారు అంటారు, అది నిజమే అనిపిస్తోంది మీతో మాట్లాడుతూ ఉంటే " అంది శృతి మరొక అరగంట తర్వాత.

" అవును, నిజం" అంది రేఖ కూడా మనస్ఫూర్తిగా. " మా నాన్నగారి కజిన్స్ ఒకళ్ళిద్దరుంటారు అమెరికాలో. ఎప్పుడో నా చిన్నప్పుడు మా ఇంటికి వచ్చారని అమ్మ చెప్తుంది కానీ నాకేమీ గుర్తు లేదు. వాళ్ళనెవరినీ నేను పెద్దయ్యాకా కలవలేదు అందుకని వాళ్ళ గురించేమీ తెలియదు. అటు బంధువులూ, ఇటు స్నేహితులూ లేకపోవడం వల్ల ఎంతో బెంగగా అనిపిస్తోంది నాకు. శశి ఆఫీస్ కి వెళ్ళిపోతే ఏం చెయ్యాలో తోచట్లేదు కూడా." అంది రేఖ.

" ఓ అలాగా? అమెరికాలాంటి పెద్దదేశంలో కనుక్కోవడం కొంచం కష్టమే. అయినా వాళ్ళ వివరాలు కనుక్కోండి. మా మమ్మీ పెద్ద సోషల్ బటర్ ఫ్లై. తనద్వారా ప్రయత్నిస్తే ఏదైనా తెలుస్తుందేమో చూద్దాం. మా డేడీ మాత్రం ఓ పెద్ద పుస్తకాల పురుగు, రెండు గంటలకొకసారి ఓ కప్పు కాఫీ ఇచ్చేస్తూ ఉంటే ఇరవై నాలుగు గంటలూ మారథాన్ లా చదివేయగలరు. అందుకే తనకి స్నేహితులూ, బంధువులూ అన్నీ పుస్తకాలే అన్నా ఆశ్చర్యం లేదు, ఇంకా సంగీతం కూడా " అంది తమాషాగా.

" ఓ, అవునా! భలే, నాకు కూడా పుస్తకాలన్నా, సంగీతమన్నా చాలా ఇష్టం, మా నాన్నగారిలా. కర్నాటక సంగీతం చాలా సంవత్సరాలు నేర్చుకున్నాను రాధా జయలక్ష్మి గార్ల దగ్గర" అంది రేఖ.

" అవునా? మా డేడీకి ఎంత ఇష్టమో కర్నాటక సంగీతమంటే. మమ్మీకి మాత్రం బోర్" అంది.

" మీకు?" అంది రేఖ నవ్వుతూ.

" నా కూతురికి నేర్పించాలని నా తాపత్రయం. చూస్తూ ఉంటే మ్యూజిక్ టీచర్ దొరికినట్టే అనిపిస్తోంది కదా!" అంది తను కూడా నవ్వుతూ.

" నేను దింపుతాను" అంటూ రేఖని ఆమె అపార్ట్మెంట్ దగ్గర దింపింది. ఇంట్లోకి రమ్మంటే " పాప నిద్ర లేస్తుంది, మరో సారి వస్తాను, ఇల్లు తెలిసిందిగా" అని బై చెప్పి వెళ్ళిపోయింది.

అలా మొదలైన పరిచయం త్వరలోనే స్నేహంగా మారింది. తరచూ రెండు కుటుంబాలు కలవడమే కాకుండా, తన ఇతర స్నేహితులకి కూడా రేఖ ని పరిచయం చేసింది శృతి.

రేఖ చాలా బాగా పాడుతుంది, పైగా సంప్రదాయ బద్ధంగా సంగీతం నేర్చుకోవడం వల్ల ఎలాంటి పాటయినా ఆమె గొంతులో ఎంతో అందంగా అమిరిపోయేది. ఇక కర్నాటక సంగీత రాగాలైతే చెప్పనే అక్కర్లేదు. దానివల్ల స్నేహబృందంలో కొందరు తరచూ తమకీ, తమ పిల్లలకీ సంగీతం నేర్పించమని అడగడం మొదలయింది. నేర్పేంత విద్వత్తు లేదని తప్పించుబోయింది రేఖ. కానీ శృతి పట్టు బట్టి క్లాసులు మొదలు పెట్టేలా చేసింది.

" నాకెందుకో రేఖ నాకు బాగా తెలుసు అనిపిస్తుంది" అంటూ ఉంటుంది శృతి తరచుగా అమర్ తో. ఆ మాటే మళ్ళీ అంది ఒకరోజు

" ఇది రెండువందల తొమ్మిదో సారి నువ్వు ఈ ఆరు నెలల్లో ఈ మాట అనడం. అయినా నాకు తెలియక అడుగుతాను, బాగా తెలియడమేమిటి నా ముఖం! నీకు బెస్ట్ ఫ్రెండ్ అయిపోతూ ఉంటేనూ. " అన్నాడు.

"అలా తెలియడం కాదు అమర్, ఎప్పటినించో తెలిసినట్టు, ఎప్పుడో, మేము ఇదివరకే ఎక్కడో కలిసి నట్టు అనిపిస్తుంది అన్నమాట" అంది.

" కొంపదీసి పూర్వ జన్మ పరిచయం అనవు కదా? ఆ పునర్జన్మల సినిమాలు అవీ చూస్తే ఇలాంటి ఆలోచనలే వస్తాయి" అన్నాడు వేళాకోళంగా.

" నేను చెప్పేది నీ కర్థం కాదు లే! , నన్నేడిపించడం తప్ప నీకు మరొకటి చేతనయితే కదా, అయినా మనిద్దరిలో సినిమాలెవరు ఎక్కువగా చూస్తారో అందరికీ తెలుసు! " అంది చిరుకోపంగా.

" పిచ్చీ, నాకు తెలుసు నువ్వేం చెప్పదలుచుకున్నావో! కొంతమంది ఎందుకో మనకి బాగా దగ్గరవారుగానూ, ఇంట్లో మనుషుల్లాగానూ అనిపించడం చాలా సహజం. ఇందులో అంతకంటే ఇంకేమీ లేదు అని అంటున్నాను. అయినా రేఖా, శశీ ఇద్దరూ కూడా చాలా మంచివాళ్ళు, వాళ్ళిద్దరినీ చూసి ఇష్టపడకపోతే ఆశ్చర్యపోవాలి కానీ దగ్గరవారిలా అనిపించడం ఆశ్చర్యం కాదు నన్నడిగితే. అది సరే గానీ, ఈ రాత్రికి భోజనం పెట్టే ప్లాన్ ఏదైనా ఉందా? ఈ ఆలోచనలని మేస్తూ కూర్చోవడమేనా? ప్రోగ్రాం ఏమిటో కొంచం చెప్తే మా జాగ్రత్తలు మేము పడతాం " అన్నాడు చిలిపిగా నవ్వుతూ..

" ఓ, సారీ, ష్యూర్. డిన్నర్ కి అన్నీ వున్నాయి. కొంచం అన్నం పెడతాను కుక్కర్లో, కాగానే తినేద్దాం" అంది తనూ లేస్తూ. అమర్ కూడా శృతి వెనకే నడిచాడు.

శృతి చాలా కలివిడిగా ఉంటుంది, అందరితోనూ తొందరగా కలిసిపోతుంది. తనకి స్నేహం చేసుకోవం చాలా సులువు. తనకి పరిచయం ఉన్న ప్రతి ఒక్కరినీ గుర్తు పెట్టుకుంటుంది, టచ్ లో ఉండడానికి ప్రయత్నిస్తుంది. అందువల్ల తనకి ఎప్పుడూ స్నేహితులెక్కువే. కానీ ఇప్పుడిలా ప్రత్యేకంగా రేఖను గురించి ఇలా తరచూ అంటూ ఉండడం అతనికి చాలా ఆశ్చర్యం గా అనిపిస్తోంది.

" ఎప్పటినించో తెలిసినట్టు అనిపించడం ఏమిటి?" అంటే తన దగ్గర ఖచ్చితమైన సమాధానం లేదు అంటుంది.

" ఈ ఆరునెలలుగా కాదు, చాలా చిన్నప్పటినించీ తెలిసినట్టనిపిస్తుంది" అంటుంది అంతే.

కొంపదీసి నిజంగానే వీళ్ళిద్దరూ పూర్వజన్మ వాసనలతో పుట్టలేదు కదా అనుకున్నాడా రాత్రి " మగధీర" సినిమా చూస్తూ.. తన ఊహకి తనకే నవ్వొచ్చింది. చేనల్ మారుస్తే ' ఓం శాంతి ఓం' వస్తోంది. ఈ సారి పైకే నవ్వేసాడు పెద్దగా.

" ఏమయింది అమర్? వాట్ ఈజ్ సో ఫన్నీ? షేర్ ద జోక్" అంది శృతి లోపలనించే..

" ఏమీ లేదులే, నథింగ్ " అన్నాడు నవ్వాపుకుంటూ. అతని అనలిటికల్ మైండ్ మాత్రం ఆలోచిస్తోంది.

శృతి వాళ్ళ తాతగారిది పెద్ద ఉమ్మడికుటుంబం. ఆయన అన్నదమ్ములు ఐదుగురూ, ముగ్గురు అక్కచెల్లెళ్ళూ ఉండేవారుట వారి తల్లితండ్రులు పోయిన తర్వాత కూడా. ఇంట్లో అందరూ చేరి రోజూ కనీసం నలభై విస్తళ్ళకి తక్కువ కాకుండా లేచేవిట. దాదాపు పిల్లలు కాలేజీలకి వచ్చేవరకూ అక్కడే కలిసి ఉండేవారుట. వంతులవారీగా మగవారు బయట పనులూ, ఆడవారు ఇంటిపనులూ చేసుకునేవారుట. ఇల్లుచిన్నదైనా ఎప్పుడూ ఇరుకు అనిపించేదే కాదు, ఎంత బావుండేదో అని తన మావగారు ఎప్పుడూ చెప్తూ ఉండగా విన్నాడు చాలాసార్లు.

ఆ తర్వాత శృతి తాతగారికి బొంబాయి బదిలీ కావడంతో ఆయన తన భార్యనీ, పిల్లలనీ తీసుకుని బొంబాయి వచ్చేశారు. అక్కడకి వచ్చాకా పిల్లల చదువులూ, ఉద్యోగం వీటిల్లో బిజీ అయిపోయారు. శృతి వాళ్ళ నాన్న జానకి రాం ఇంజనీరింగ్ పూర్తికాగానే అమెరికా వచ్చేశారు. అప్పటినించీ అక్కడే ఉండిపోయారు. వచ్చిన మూడేళ్ళకి శృతి తాతగారు కాలం చేశారు. నాన్నమ్మ ఎక్కువగా బొంబాయిలో ఉన్న ఆమె పెద్దనాన్న దగ్గరే ఉంటుంది. మధ్య మధ్యలో వచ్చేది. నాన్నమ్మ వస్తే శృతికీ, శాంతను కీ ఎంతో సరదాగా ఉండేది, ఆవిడ చాలా కథలు చెప్పేది, పాటలు పాడేది. తెలుగు నేర్పించేది మనవలిద్దరికీ.

పెద్దనాన్న, అమ్మ చెల్లెళ్ళిద్దరూ కూడా బొంబాయిలోనే ఉండడంతో ఇండియా వెళ్ళినప్పుడల్లా ఎక్కువగా బొంబాయిలోనే గడిపేవారు. హాలిడే కి వెళితే ఏదైనా హిల్ స్టేషనో, మరేదైనా విహార స్థలమో వెళ్ళేవారు. ఎప్పుడైనా ఒకటి రెండు సార్లు నాన్న కజిన్ల పిల్లల పెళ్ళిల్లకి అంటూ

హైదరాబాద్ వెళ్ళి ఉంటుంది శృతి. చెన్నై ఎప్పుడూ వెళ్ళలేదు, మరి రేఖని ఎప్పుడు చూసే అవకాశమే లేదు, రేఖ ఎప్పుడూ చెన్నై వదిలి రాలేదుట. ఆమె చదువంతా అక్కడే జరిగింది. నాలుగేళ్ళ క్రితం పెళ్ళి జరిగింది రేఖకి , శశిధర్ కి. అతనికి ఆన్ సైట్ ప్రాజెక్ట్ రావడంతో ఈ మధ్యనే ఇక్కడకి వచ్చారు కదా.  అలాంటప్పుడు శృతి రేఖని ఎప్పుడు, ఎక్కడ చూసే అవకాశం ఉంది? అమర్ ఆలోచనలు తెగడం లేదు.

టీ. వీ ముందు కూర్చుని కూడా చేతిలో రిమోట్ పట్టుకుని కిటికీలోంచి బయటకు చూస్తున్న అమర్ ని " ఏవిటో అంత దీర్ఘాలోచన?" అంది చిన్నగా.

" ఏమీ లేదు, రేఖ గురించి ఇందాకా నువ్వన్న మాటలగురించే ఆలోచిస్తున్నాను" అన్నాడు. "యా, దేర్ ఈజ్ సంథింగ్" అంది తను కూడా.

" నా కాపురంలో చిచ్చు పెడుతున్న ఈ చిక్కుముడినెవరైనా విడదీస్తే బాగుండును" అన్నాడు అల్లరిగా నవ్వుతూ.

" అంత ఎక్కువగా ఆలొచిస్తూ, మాట్లాడుతూ విసిగిస్తున్నానా? సారీ ఐతే ! అంది వచ్చి అతని పక్కన కూర్చుంటూ. లేదురా, ఊరికే అన్నాను అన్నాను అనునయంగా.

★★★

"మా డేడీ ది అరవైయ పుట్టినరోజు, మా నాన్నమ్మది ఎనభైయవ పుట్టినరోజు ఒకే నెలలో వస్తాయి. నేను, అమర్ వాళ్ళని ఇక్కడకి పిలిచి సర్ ప్రైజ్ పార్టీ ఇద్దామని అనుకుంటున్నాము. ఆ ఫంక్షన్ లో నీకు పాడటానికి వీలవుతుందా? ఒక్క కృతి మా డేడీ కోసం పాడగలవా? " అంది శృతి, రేఖ తో.

" పుట్టబోయే జూనియర్ రేఖ పర్మిషన్ తీసుకోవాలి కదా అని అడిగాను, లేకపోతేనా,  నీది ఒక స్పెషల్ కచేరీ ఏర్పాటు చేసి ఉండేదాన్ని కదూ? "అంది హుషారుగా. రేఖ ఆరునెలల గర్భవతి అప్పటికి.

" పరవాలేదు తప్పకుండా పాడతాను రెండు కృతులైనా. మీ డేడీ కి చాలా ఇష్టం అని ఎప్పుడూ చెప్తావు కదా, అమ్మా వాళ్ళు వస్తారు కదా వచ్చేవారం, పని ఉండదు కదా, అలసట కూడా ఉండదు " అంది రేఖ.

" థాంక్ యూ రేఖా! నీకోవిషయం తెలుసా? మన పరిచయం అయ్యాక ఒకేసారి మన ఇద్దరి పేరెంట్స్ రాబోతున్నారు కదా, మా నాన్నమ్మ బోనస్". అంది శృతి సంతోషంగా.

" నిజమే" అంది రేఖ.

శృతి అమ్మా, నాన్నలకి తెలియకుండా పార్టీ జరగాలని చాలా సీక్రెట్ గా, పెద్ద ఎత్తున పార్టీ ఏర్పాటు చేశారు అమర్, శృతి. తమ స్నేహితులనీ, తమకి దగ్గరలో ఉన్న అమ్మా నాన్నల స్నేహితులనీ అందరినీ పిలిచేశారు. రేఖ కచేరీ కాక, మరో ఇద్దరు ఫ్రెండ్స్ వి కూడా ప్రోగ్రాములు ఏర్పాటు చేశారు.

ఇండియన్ రెస్టారెంట్ నించీ, తెలిసిన వారి దగ్గరనించీ రకరకాల పదార్థాలని ఆర్డర్ చేశారు. ఆన్లైన్ లో ఆర్డర్ చేసి అందరికీ కానుకలు తెప్పించారు. బట్టలు సరే సరి.

అందరికీ ఇన్విటేషన్లతో పాటు తనే ఇంట్లో స్వయంగా తయారు చేసిన కప్ కేకులూ, చాకలెట్లు చిన్న చిన్న డబ్బాలలో పెట్టి ఇచ్చింది. రేఖ కూడా వీలున్నప్పుడల్లా వచ్చి సాయం చేస్తోంది. పార్టీ మరొక వారం ఉందనగా వచ్చారు శృతి అమ్మా, నాన్నా నాన్నమ్మ. వాళ్ళు వచ్చేసరికి అన్ని పనులూ పూర్తయ్యాయి. పార్టీ కి సంబంధించినవన్నీ గరాజ్ లో పెట్టేసి దాచేసింది.

నా స్నేహితురాలింట్లో పార్టీ, మనందరినీ రమ్మంది అని తీసుకువెళ్ళింది ముగ్గురినీ. స్వతహాగా సరదాగా, యాక్టివ్ గా ఉండే ఉండే శృతి అమ్మ ఒకసారి చెప్పగానే వస్తానని సరదా పడింది కానీ మిగతా ఇద్దరూ ఒక పట్టాన ఒప్పుకోలేదు. వాళ్ళని ఒప్పించి తీసుకువెళ్లడం కొంత కష్టమే అయింది." వాళ్ళెవరో? ఏమిటో? మాకేం తెలియదు" అంటూ మొదలు పెట్టారు. మొత్తానికి అందరూ కలిసి పెద్ద కార్లో పార్టీ హాల్ కి వెళ్ళారు.

అక్కడ కూడా ఈ పార్టీ తమకోసమే ఏర్పాటు చెయ్యబడిందని వాళ్ళకి తెలియకుండా చాలా జాగ్రత్తపడ్డారు అమర్, శృతి.

మెల్ల మెల్లగా అతిధులందరూ రాసాగారు. చాలా మంది తమకి తెలిసిన వారుండడం శృతి అమ్మా, నాన్నలకి చాలా ఆశ్చర్యంగా అనిపించింది. వచ్చిన తమ స్నేహితులు శుభాకాంక్షలు చెప్పసాగారు. అప్పుడొచ్చింది వారికి అనుమానం అప్పుడే అమర్, శృతి వాళ్ళిద్దరి పేర్లూ, విషెస్ రాసి ఉన్న పెద్ద బోర్డ్ తెచ్చి కేకు పెట్టే టేబిల్ వెనక పెట్టారు. గిన్నెలో పెరుగన్నం గోరు ముద్దలు పెడుతున్న శృతి నానమ్మ శారదమ్మా, పక్కన కూర్చున్న మూడేళ్ళ పసివాడు జానకిరాం. "అమ్మచేతి గోరుముద్దలకి వయసులేదు కదా" అన్న అర్ధం వచ్చేలా కేప్షన్ రాసి ఉంది.

ఆ బేనర్ చూడగానే సంతోషంతో కంటనీరు తిరిగింది శారదమ్మకి. " శృతులూ, ఇది మాకోసం నువ్విచ్చే పార్టీవా? ఈ ఫోటో ఎక్కడ దొరికిందిరా నీకు? " అంటూ శృతిని కౌగలించుకుని నుదిటిన ముద్దు పెట్టింది.

కేక్ తను తెస్తానని రేఖ ముందే చెప్పింది. అందుకే కేక్ తీసుకుని వచ్చారు రేఖా, శశిధర్, ఆమె తల్లితండ్రులూ. వారిని అందరికంటే ముందు చూసినది శారదమ్మ. ఆనందంతోనూ, ఆశ్చర్యంతోనూ ఆవిడ కళ్ళు పెద్దవయ్యాయి. అతిధులని ఒక్కొక్కరినీ పరిచయం చేస్తున్న శృతినీ, అమర్ నీ వదిలేసి గబ గబా రేఖ తల్లితండ్రుల దగ్గరకి పరుగుతీసిందావిడ. ఆవిడ ఎందుకలా పరిగెడుతోందో, తెలియక ఆశ్చర్యంగా చూడసాగారు శృతీ వాళ్ళు.

" ఒరే విశ్వం, నువ్వు .. నువ్వేనా? ఇక్కడున్నావేవిట్రా, ఎలా?" అంది పట్టరాని ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతూ అతన్ని కౌగలించుకుం ది.

" అరే శారద పిన్నీ! నువ్వా! వీడు మన జానకి కదూ! ఎన్నేళ్ళయిందిరా నిన్ను కలిసి? " అన్నాడాయన. ఆయన కళ్ళల్లోనూ దాచుకోలేని ఆనందం, పట్టరాని సంతోషం.

" అత్తయ్యా బాగున్నారా? ఎన్నేళ్ళకి చూస్తున్నాను" అంటూ ఆనందంగా వచ్చింది రాధ తల్లి మీనాక్షి.

" అవునే మీనాక్షి, మీరేమిటి ఇక్కడ? మీకు శృతి తెలుసా? అమరా?" ఆనందంలో ఏమడుగుతోందో తెలియడంలేదు ఆవిడకి. వీళ్ళందరినీ ఆశ్చర్యంగా చూస్తున్నారు శృతీ, రేఖా, వారి భర్తలూ..

" నాన్నమ్మా! ఎవరు?" అంది శృతి మెల్లగా..

" మీ పెద్దనాన్నే! విశ్వం పెద్దనాన్న, మీ నాన్నకి పెద్దనాన్న గారి కొడుకు. అంటే నాకు బావగారి కొడుకన్నమాట" అంది అతని చెయ్యి పట్టుకుని వదలకుండా.

" అవునా? " అంటున్న శృతిని అక్కడే వదిలేసి వాళ్ళిద్దరి చేతులూ పట్టుకుని తన పక్కనే కూర్చోబెట్టుకుంది ఆవిడ. 'ఎవరు మాట్లాడుతున్నారో? ఎప్పుడు ఆపుతారో' తెలియనట్టుగా సాగుతున్నాయి వాళ్ళ కబుర్లు. కబుర్లకంటే ఎక్కువ ఎన్నో ఏళ్ళకి కలిసిన ఆనందం. ముఖ్యంగా జానకి రాం, విశ్వాలలో. శారదమ్మకి నోట మాటలూ, కంట కన్నీరూ రెండూ ఆగడం లేదు. చీర చెంగుతో కళ్ళు ఒత్తుకుంటూ అందావిడ

" ఏరా విశ్వం, నువ్వెప్పుడైనా బొంబాయి వచ్చిన పాపాన పోయావూ? చిన్నప్పుడు నేను పెడితేనే అన్నాలు తినేవారు మీరందరూ. అలాంటిది ఒక్కసారైనా పిన్నిని చూడాలని అనిపించలేదూ.. వీడంటే సరే అమెరికా అంటూ ఇక్కడకొచ్చి ఊరేగాడు, పట్టాభి, అదే వీడి అన్న అక్కడే ఉన్నాడు కదా, వాడినీ, వదిననీ కూడా చూసినట్టవును కదూ" అంది ఉక్రోషంగా..

" నిజమే పిన్నీ, ఏవిటో ఎప్పుడైనా హైదరాబాద్ వచ్చాను కానీ బొంబాయి ఎప్పుడూ రాలేదు. క్రిందటిసారి నిన్ను చూసినది శర్మ బాబయ్య గారింట్లో నే కదూ" అన్నాడాయన.

" ఆ, అది జరిగి ఆరేళ్ళు దాటడంలేదూ, ఎదో నిన్ననే అయినట్టు చెప్తున్నావు" అంది. అయినా ఎవరి ఉద్యోగాలూ, జీవితాలు వారికి ఏర్పడ్డాకా గతంలోలా కుదురుతుందా ఏం? ఈ మహానగరాల జీవితాలొచ్చాకా మేమే చిన్నప్పటిలా ఉండలేకపోయాము. ఇప్పుడు రా, రిటైర్ అయ్యావు కదా. ఈ అమ్మాయి రేఖ నీ కూతురా? ఎంత లక్షణంగా ఉందో? చక్కగా పాడుతుందిట. మన శృతి చెప్పింది " అంటూ మళ్ళీ శృతినీ, అమర్ నీ పరిచయం చేసింది వాళ్ళకి.

" నిజమే పిన్నీ, జానకీ, నేనూ కలిసి కూడా పదేళ్ళయిందేమో ఈజీగా. మళ్ళీ మాట్లాడితే చిన్నప్పుడు ఒకేదగ్గర పెరిగిన వాళ్ళం, నా బట్టలే తొడుక్కునేవాడు ఎప్పుడూ" అన్నాడు ఆయన తమ్ముడి చెయ్యి తన చేతిలోకి తీసుకుంటూ..

వీళ్ళందరినీ ఎంతో విచిత్రంగా చూస్తున్నారు శృతి, రేఖా.

రాత్రి నానమ్మ తనతో అన్న మాటలే అప్రయత్నంగానే గుర్తొచ్చాయి శృతికి. ఉమ్మడి కుటుంబంలో అందరితోటీ కలిసి ఉన్న ఆవిడ ఎప్పటికీ ఆ రోజులు మర్చిపోలేదు. తరచూ ఆ పాత జ్ఞాపకాలని నెమరువేసుకుంటూ, మనవలతో పంచుకుంటూ ఉంటుంది..

"మా రోజుల్లో ఉమ్మడి కుటుంబాలు ఎంత సరదాగా ఉండేవో తెలుసా? గొడవలు, అసూయలు లేవనను, అన్నీ ఉండేవి. అయినా ఎదో తెలియని నిండుతనం, సరదా, ఆనందం ఉండేవి. ఇప్పుడీ ఒంటికాయ సొంటికొమ్ము సంసారాల్లో ఆ సందడేదీ? మీకు పెద్ద పెద్ద ఇళ్ళూ, వాకిళ్ళూ ఉన్నాయనుకో. మనుషులేరీ? అప్పుడు మాకు ఇళ్ళు చిన్నవే కానీ మనసులు పెద్దవి. నువ్వెన్నైనా చెప్పు మా రోజులే బావుండేవి మీ తాతగారు వాళ్ళు ఐదుగురు అన్నదమ్ములు, వాళ్ళ అక్కలూ, చెల్లెళ్ళూ. ఇలా అందరూ ఉంటే ఇల్లు ఎంత నిండుగా ఉండేదో. మేము బొంబాయి వచ్చేవరకూ.

ఆతర్వాత మీ తాగారు పెద్దాఫీసరయ్యి సెలవులు తగ్గిపోయాయి. అయినా నేను పిల్లలని తీసుకుని వెళ్ళేదాన్ని అందరితో గడపడానికి. మెల్లి మెల్లిగా అందరం ఒక్కో చోటికీ వెళ్ళిపోయాము. మళ్ళీ ఆ రోజులెప్పటికైనా వస్తాయా ? అనిపిస్తుంది శృతమ్మా. ఇటు అమ్మమ్మా, అటు నానమ్మా తప్ప మీకేం చుట్టరికాలు తెలుసు? మీరే ఇలా ఉంటే రేపు మీ పిల్లలకేం నేర్పుతారు? అందరూ విసిరేసినట్టు తలో మూలా ఉంటే మీరందరూ కలుసుకునేదెప్పుడు? తెలుసుకునేదెప్పుడు?"

ఎప్పటెప్పటివో చుట్టరికాలు అలవోకగా చెప్తుందావిడ. ఇప్పటికీ అందరినీ ఫోన్లు చేసి పలకరిస్తుంది. వాళ్ళు కూడా అంతే. " ఇంతమంది ఎలా తెలుసు నాన్నమ్మా ? అని అడిగితే, మనుషులమన్నాకా ఆ మాత్రం తెలుసుకోవద్దూ, చుట్టరికాలు చెప్పుకోవాలి, నిలుపుకోవాలి. లేకపోతే ఎవరూ ఎవరికీ తెలియరు. ఇంట్లోవాళ్ళని కూడా పైవాళ్ళని పరిచయం చేసుకున్నట్టు చేసుకోవాలి". అనేది.

"ఎంత నిజం? అవి తెలియకే కదా, తన స్నేహితురాలు రేఖ తన కి కజిన్ అవుతుందని తెలుసుకోవడానికి ఇన్నాళ్ళు పట్టింది తనకి" అనుకుంటేనే ఎలాగో అనిపించింది శృతికి.

" వీడు జానకిరాం, నీకు బాబాయ్ అవుతాడమ్మా, మా తమ్ముడు అని చెప్పాడు "విశ్వం రేఖకి.

" అవును శృ బంగారం, మీ పెద్దనాన్న, పెద్దమ్మా." అని జానకిరాం పరిచయం చేశాడు శృతికి, అమర్ కీ. వీళ్ళమధ్య జరుగుతున్న సంభాషణనీ, సందర్భాన్నీ అర్ధం చేసుకున్నవారు వీరిని ఆనందంగానూ, లేని వారు అయోమయంగానూ చూస్తున్నారు

కాసేపట్లో పార్టీ ప్రారంభమయింది. కేక్ కట్ చేశాకా పార్టీకొచ్చిన అతిథులని ఉద్దేశించి అమర్ మాట్లాడాడు.

తాము సరదాగా సర్ప్రైజ్ పార్టీ ఏర్పాటు చెయ్యాలనుకుంటే అది తమ కుటుంబాలకెంత గొప్ప సర్ ప్రైజ్ నిచ్చిందో చెప్తూ.. అసలు రేఖ కి శృతికి పరిచయం ఎలా అయిందో, ఎలా ఎప్పుడూ శృతి రేఖ తనకెప్పటినించో తెలిసున్నట్లుగా అనుకునేదో కూడా క్లుప్తంగా చెప్పాడు.

" నాకు తెలిసి రేఖా, శృతి ఎప్పుడైనా ఒకసారి కలిస్తే కలిసుండవచ్చేమో, కానీ శృతి ఎప్పుడూ రేఖని చూస్తే నాకెప్పటినించో తెలుసున్న భావన కలుగుతుంది అనేది. నేనేమో సినిమాల్లో చూపించినట్టు పునర్జన్మల బంధమేమో అని ఏడిపించేవాడిని.

కానీ ఈరోజు జరిగిన సంఘటన చూస్తే నాకు బ్లడ్ ఈజ్ థికర్ దేన్ వాటర్, అది ఎక్కడున్నా తనవారిని గుర్తుపడుతుంది, అందుకే అది రక్తసంబంధం అయింది అన్న మాట ఎంత నిజమో కదా! అనిపిస్తోంది. లేకపోతే ఎక్కడో పుట్టిన వీరిద్దరూ, ఒకేచోట అంటే అక్కడే పెరిగిన వీరి పెద్దలూ ఈరోజు ఇక్కడ కలవడం ఎంత విచిత్రమో, అంత సంతోషకరం కూడా. ఇది మా అందరికీ నిజంగా ఎంతో ఆనందకరమైన రోజు. మీ అందరితో పంచుకోవడం మరింత ఆనందంగా ఉంది. " అన్నాడు. అందరూ చప్పట్లు కొడుతూ ఉండగా కేక్ కటింగ్ జరిగింది.

పట్టరాని సంతోషంతో తన కజిన్ రేఖని వాటేసుకుంది శృతి.

Click here to share your comments on this story